క్లుప్తంగా

అన్నదానం

మాచర్ల: శ్రీ శారదా మాత ఉచిత నారాయణ సేవ పేరుతో స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి మూడు పూటలా నిత్యాన్నదానం చేపట్టారు. గురువారం బస్టాండ్, రైల్వే స్టేషన్, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, రోడ్డు వెంబడి ఉన్న యాచకులు, అనాథలకు అన్నదానం చేశారు.

రాగసుధా కళా పరిషత్ సభ్యుడి మృతి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని రాగ సుధా కళా పరిషత్ సభ్యులు మోతడక వెంకట చలపతిరావు హార్ట్ ఎటాక్‌తో గురువారం మృతి చెందారు. రాగ సుధా కళా పరిషత్ ద్వారా కళాకారులకు ఎన్నో సేవలు అందించారని పలువురు అన్నారు. ప్రముఖ ఫొటో గ్రాఫర్‌గా జూనియర్ ఫొటో గ్రాఫర్‌లకు సేవలు అందించి, వారి అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు.

చినగార్లపాడులో రోడ్డు పనులు



కారెంపూడి: మండలంలోని చినగార్లపాడు గ్రామంలో 40ఏళ్లుగా అసౌకర్యంగా ఉన్న బజారు రోడ్డు నిర్మాణానికి గ్రామస్తులు బత్తుల శ్రీను, బత్తుల ప్రసాద్ తదితరులు గురువారం పూనుకున్నారు. గ్రామ మెయిన్ రోడ్డులోని ఓర్సు చంద్రపాల్ ఇంటి నుంచి చల్లా నరసింహారావు ఇంటి వరకున్న రోడ్డు అధ్వానంగా ఉంది. ఇక్కడ సైడు కాల్వల నిర్మాణంతో పాటు రోడ్డుకు శ్రీను మట్టి తోలిస్తుండడానికి ముందుకు రాగా.. రోడ్డు నిర్మాణానికి కొంత మేర అవసర స్థలాన్ని ప్రసాద్ ఇచ్చారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

స్నేహమంటే ఇదేరా..



రెంటచింతల: స్నేహితుడు మరణించడంతో.. అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులు ముందుకొచ్చారు. మండల కేంద్రంలోని ఆనంద పేటకు చెందిన అనుముల అజయ్‌కుమార్ మృతి చెందాడు. స్థానిక సెయింట్ జోసఫ్స్ పాఠశాలలో అతనితో చదువుకున్న స్నేహితులు స్పందించారు. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని.. అజయ్ కుమార్ సోదరుడు దివ్యాంగుడైన నవీన్‌కుమార్ పేరుపై స్థానిక పోస్టాఫీస్ లో రూ.60 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. బాండ్ పేపర్‌ను పోస్ట్ మాస్టర్ వీరాంజనేయులు, పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు తుమ్మా లూర్దురెడ్డి చేతుల మీదుగా నవీన్ కుమార్‌కు గురువారం అందజేశారు.

మెరుగైన శిక్షణతో భవిత



పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ భవిత పాఠశాలను హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా గురువారం సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఆట వస్తువుల ద్వారా బోధన చేస్తున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రిసోర్స్ పర్సన్లు విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. రిసోర్స్ పర్సన్స్ ఎం. అజిత్‌కుమార్, ఎ. హరికుమార్, సామాజిక కార్యకర్త తన్నీరు శివ న్నారాయణ పాల్గొన్నారు.

దళిత గిరిజనులకు భాగస్వామ్యం కల్పించాలి

నరసరావుపేట: ఈ ఏడాదిలో వనరుల్లో వాటా నిర్ణయాధికారంలో దళిత గిరిజనులకు భాగస్వామ్యం కల్పించాలని ఏపీ దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లోని నాలుగో తరగతి ఉద్యోగుల భవన మీటింగ్ హాలులో జిల్లా కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవకుమార్ మాట్లాడుతూ దళిత గిరిజనులు జనాభా ప్రాతిపదికను బడ్జెట్ కేటాయించి వారి నివాస ప్రాంతాలు, అభివృద్ధి కోసం ఉన్నటువంటి అవసరాలను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించి కేటాయించిన బడ్జెట్‌ను సమర్థవంతంగా ఖర్చుచేసి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మేడే వెంకటరమణ, తోకల సాంబయ్య, కోటి రత్నం, ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపు పీఎన్‌సీ కళాశాలలో ఉద్యోగ మేళా

నరసరావుపేట ఈస్ట్: పల్నాడురోడ్డులోని పీఎన్‌సీ అండ్ కెఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 15వతేదిన హైదరాబాద్‌కు చెందిన హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు, ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్టు కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్ గురువారం ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

మిల్లర్లు..మద్దతు ధర కిల్లర్లు

- కంది వ్యాపారులు, దళారులు సిండికేట్
- రైతుల నుంచి పంట కొనుగోలు చేయకుండా కుట్ర
- సాగుదారులే మిల్లులకు పంట తీసుకొచ్చే ప్లాన్..
- ఇదే అదునుగా బేరమాడి తక్కువ ధరకు కొనుగోలు
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.7,550
- ఎక్కడా అమలు కానివ్వని వైనం
- ఎవరైనా మిల్లర్ రైతు వద్దకు వెళ్తే జరిమానా?



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కందులు

దుర్గి: రాష్ట్రంలో అత్యధికంగా కందిపప్పు మిల్లులు దుర్గి, మాచర్ల, వినుకొండలలో ఉన్నాయి. సుమారుగా 100కు పైగా మిల్లులు నిరంతరాయంగా పనిచేస్తుంటాయి. వీరికి కావాల్సిన కందులను ఏపీతో పాటు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటారు. కానీ, స్థానికంగా ఖరీఫ్‌లో పండించిన కందులను కొనుగోలు చేయడానికి సంబంధిత వ్యాపారులు, దళారులు ముందుకు రావడం లేదు. గతంలో ఇటువంటి పరిస్థితి ఎన్నడూ లేదని రైతులు చెబుతున్నారు. రైతులు పంటను నేరుగా మిల్లు వద్దకు తీసుకెళితేనే.. వారికి నచ్చిన ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా వాసి అయినప్పటికీ కందుల కొనుగోళ్లకు తీసుకున్న చర్యలు శూన్యమని రైతులు విమర్శిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర రూ.7,550లకు కొనుగోలు చేయాల్సి ఉన్నా కేవలం రూ.6 వేల నుంచి రూ. 6,400ల మధ్య కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారు. పల్నాటి ప్రాంతానికి చెందిన దాల్ మిల్లర్లు సిండికేట్ అయ్యి.. రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల వద్దకు వెళ్లి ఏ మిల్లరైనా కొనుగోలు చేస్తే రూ.లక్ష జరిమానా విధించేలా నియమ నిబంధనలు పెట్టినట్లు సమాచారం. ఇటువంటి పరిస్థితుల్లో కనీసం పౌరసరఫరాల శాఖ అధికారులు కానీ, మార్క్ ఫెడ్, నా ఫెడ్ సంస్థలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటం చూస్తే మిల్లర్లు, అధికారులు ములాఖత్ అయినట్లు రైతాంగం భావిస్తోంది. ప్రభుత్వ పెద్దలు ఈ విషయంలో జోక్యం చేసుకొని తమకు కనీస మద్దతు ధరను కల్పించాలని రైతాంగం కోరుతున్నారు.

మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం

రైతుల నుంచి ప్రతి గింజను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తాం.. తొందరపడి దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు కందులను అమ్ముకోవద్దు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 7,550కి కొనుగోలు చేస్తాం. 12 శాతం ఉన్న కందులనే చూసుకోవాలి. ప్రతి రైతు ఈకేవైసీలో రిజిస్టర్ చేసుకోవాలి. త్వరలో మరిన్ని కంది కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

– ఆర్ కృష్ణారావు, మార్క్‌ఫెడ్ డీఎం

నిలువునా మోసం చేస్తున్నారు

కందిన పంటను మార్కెట్‌లో అమ్ముకోవాలంటే కొనేనాథుడే లేడు. వ్యాపారులు సిండికేట్‌గా మారి కేవలం క్వింటా రూ. 6 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. గతంలో ఇలాంటి పరిస్థితి చూడలేదు. గతేడాది రూ. 10 వేలకు పైగా కందులు విక్రయించాం. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని మద్దతు ధరను అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి.

– ఆర్.లక్ష్మణ్, రైతు, దుర్గి

ఆటంకం లేని వ్యవసాయ విద్యుత్ సరఫరా

సాక్షి ఎఫెక్ట్

దుర్గి: వ్యవసాయానికి సంబంధించిన 9గంటల విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఏఈ ఎ.శ్రీశైలం తెలిపారు. గురువారం "సాక్షి" దిన పత్రికలో ప్రచురితమైన "ఆరుగాలం ఏడు పంట" శీర్షికన కథనానికి ఆయన స్పందించారు. దుర్గి 11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉందని, మిగిలిన ఆరు సబ్ స్టేషన్ పరిధిలో సరఫరాకు అటంకం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. 11కేవీ పోలేపల్లి ఫీడర్ 3 ఫేజ్ నుంచి శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉంటుందని తెలిపారు. పరిధిలోని దుర్గి, ఆత్మకూరు రైతులు దానికనుగుణంగా విద్యుత్‌ను ఉపయోగించుకోవాలన్నారు. 11కేవీ వనం ఫీడర్‌లోని ఓబులేశునిపల్లె, దుర్గి, పరిధిలో గల రైతులకు ఉదయం 4 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కేటాయించామన్నారు. 11కేవీ జంగమహేశ్వరపాడు ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు, రాత్రి 10 నుంచి 12గంటల వరకు, 11కేవీ ఓబులేశునిపల్లె ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, ధర్మవరం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 4గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3గంటల వరకు కేటాయించామన్నారు. శ్యామరాజుపురం ఫీడర్ ఉదయం 4గంటల నుంచి 11గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కరెంట్ ఉంటుందన్నారు. ఆయా వేళల్లో విద్యుత్ సరఫరా ఉంటుందని రైతులు గమనించాలని కోరారు. వారం రోజుల పాటు ఇది ఉంటుందన్నారు.

రైతు గుర్తింపు కార్డుతోనే రాయితీలు



మాట్లాడుతున్న ఏఓ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రారంభించిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఇచ్చే 11 అంకెల గుర్తింపు సంఖ్య ఆధారంగానే 2025-26లో రాయితీపై ఎరువులు ఇవ్వడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. గురువారం రెంటచింతల, మిట్టగుడిపాడు గ్రామాల్లో ఆయన మిర్చి పంట పొలాలను పరిశీలించి, మాట్లాడారు. రైతులకు వ్యవసాయ పరమైన అన్ని పథకాలను పారదర్శకంగా అందజేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. దీనిలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్యతో మంజూరు చేసే ప్రత్యేక గుర్తింపు కార్డు ఇస్తారన్నారు. దీంతో 2025-26 సీజన్ నుంచి ఎరువులు, విత్తనాలు, పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పెట్టుబడి సాయం, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సూక్ష్మ సేద్యంపై రాయితీ తదితర పథకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల రైతులు వెంటనే ఆధార్ కార్డు, ఆధార్ అనుసంధానించిన మొబైల్ నంబరు, పట్టాదారుని పాస్ బుక్‌ను తీసుకుని గ్రామ రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న యరపతినేని నిఖిల్

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు బల ప్రదర్శన పోటీలను టీడీపీ నాయకుడు యరపతినేని నిఖిల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు జాతి పశు పోషకులను ప్రోత్సహించేందుకు ఎడ్ల పందేలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాడి, పంట, సుఖ సంతోషాలతో రైతులను చల్లగా దీవించాలని స్వామి వార్లను వేడుకున్నట్లు తెలిపారు. ఆరుపళ్ల విభాగంలో పోటీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం న్యూ కేటగిరి (సేద్యపు) విభాగంలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): పాలువాయి జంక్షన్ వద్ద వేంచేసిన షిర్డిసాయి మందిరంలో గురువారం అర్చకులు గోపాల్ పాండే ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో మందిరానికి చేరుకుని సాయి నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవరణలో భజనా బృందం బాబా గీతాలను ఆలపించింది. గ్రామానికి చెందిన దారపునేని చెన్నయ్య, ఉమాదేవి దంపతులు భక్తులకు అన్న సంతర్పణం చేశారు. చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాబాకు ప్రత్యేక పూజలు

కారెంపూడి: స్థానిక షిర్డి సాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగడ హారతి, బాబా మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అర్చకులు దిలీప్ కుమారాచార్యులు పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త ఏచూరి శంకరరావు, భక్త మండలి అధ్యక్షురాలు గుండా నాగమల్లేశ్వరి కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. సూరె ఆంజనేయులు కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేయూతనిచ్చారు.

అంగన్‌వాడీ పాఠశాలలను బలోపేతం చేయాలి





గురజాల: అంగన్‌వాడీ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి సీడీపీవో వై.రత్నకుమారి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు పోషణ్ బీ-పడాయి బీ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. మొదటి రోజు సీడీపీఓ పాల్గొని మాట్లాడుతూ.. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందించడం, చిన్నారుల ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులకు ఏ విధంగా చదువుపై ఆసక్తి కల్పించాలి అనే విషయాలను వివరించారు. మొదటి రోజు శిక్షణలో 44 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషణపై అంగన్‌వాడీలకు అవగాహన

మాచర్ల రూరల్: అంగన్‌వాడీ చిన్నారులకు పోషక ఆహారంతో పాటు విద్యనందించటంలోనూ సమాన బాధ్యతలను నెరవేర్చాలని సీడీపీఓ శరణ్య అన్నారు. గురువారం కార్యాలయంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు పోషన్ బీ పడాయి భీ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 0 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వయస్సు, ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా వారికి పోషణ అందించడంలో తల్లిదండ్రులతో చర్చించి ఎదుగుదలలో సహకరించాలని కోరారు. అలాగే వారికి విద్యాబుద్ధులు నేర్పించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. తెలుగు, ఇంగ్లీషు మీడియం బాషను బోధించి వారు పాఠశాలలో చేరే సమయానికి అక్షర జ్ఞానం పూర్తిగా వచ్చేలా పాఠ్యాంశాలను బోధించాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లీలావతి, జ్యోతి, టీచర్లు పాల్గొన్నారు.

పోషణపై శిక్షణ

మాచర్ల: ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, ఆరోగ్యంతో పాటు చిన్న నాటి నుంచే క్రమశిక్షణతో విద్యాబోధన అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీలపై ఉందని సీడీపీఓ సరళ, సూపర్‌వైజర్ దుర్గా అన్నారు. గురువారం పట్టణంలోని జెడ్పీ బాలురోన్నత, బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ బీ పడాయి బీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిన్న నాటి నుంచే విజ్ఞానం పెంపొందించేలా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు లీలావతి, జ్యోతి శిక్షణనిచ్చారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ తగదు

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు బాజీ

నాదెండ్ల: వక్ఫ్ బోర్డు ఆస్తుల విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకుంటే సహించేది లేదని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ చెప్పారు. మండలంలోని తూబాడు గ్రామంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యసభలో వక్ఫ్‌బోర్డు బిల్లు ప్రవేశ పెట్టడాన్ని యావత్తు ముస్లిం సమాజం ఖండిస్తుందన్నారు. తరతరాలుగా ముస్లిం వర్గానికి చెందిన ఆస్తులను ముస్లింలే నిర్వహించుకోవటం సబబని, ఇతరుల చేతుల్లో పెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న నిర్ణయం సహేతుకంకాదన్నారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనలతో వక్ఫ్‌బోర్డు హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతో కలిశామని ఎన్నికల్లో ప్రకటన చేసిన కూటమి నాయకులు నేడు వక్ఫ్‌బోర్డు బిల్లుపై నోరు మెదపకపోవటం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలకు అనుకూలంగా నిలబడాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ముస్లింల మద్దతు కావాలంటే వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే జూలకంటి పాఠశాల సందర్శన



కారెంపూడి: మండలంలోని నరమాలపాడు ప్రాథమిక పాఠశాలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన అదనపు సౌకర్యాల విషయమై ఉపాధ్యాయులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు ఉన్నం లక్ష్మీనారాయణ, పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, మునుగోటి సత్యం ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

వాహనాల తనిఖీ

కారెంపూడి: మాచర్ల ఆర్టీఓ శేషురెడ్డి గురువారం కారెంపూడిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. స్థానిక వినుకొండ వెళ్లే రోడ్డులో సాగర్ కాల్వ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పది వాహనాల యజమానులకు జరిమానా విధించారు. వాహనాలను కండిషన్‌లో పెట్టుకోవడంతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పక చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ అండగా ఉంటుందని హితవు పలికారు. మాచర్ల ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ



వాహనదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

గురజాల : వాహనదారులు హెల్మెట్ వాడి ప్రాణాలకు రక్షణ కల్పించుకోవాలని డీఎస్పీ బి జగదీష్ సూచించారు. స్థానిక హైవేలో గురువారం రాత్రి నో హెల్మెట్...నో ఎంట్రీ కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధికంగా మృతుల కేసులు నమోదైనట్లు తెలిపారు. హెల్మెట్ ధరించి కొందరు ప్రాణాలను కాపాడుకున్నారన్నారు. వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే అట్టి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ ఆవుల భాస్కర్ , ఎస్ఐ వై వినోద్‌కుమార్ తదితరులున్నారు.

నేడు వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



రెంటచింతల: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ద్వితీయ వార్షిక మహోత్సవాలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి, ప్రధాన అర్చకుడు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు గురువారం తెలిపారు. వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శాంతి కల్యాణ మహోత్సవం కనుల పండుగగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వార్షికోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొంది, తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు. ఆలయ చైర్మన్ పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి, కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 5 గం. నుంచి స్వామి వార్ల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్వామి వివేకానంద సాహిత్యంపై పరీక్ష



బహుమతులు ప్రదానం చేసిన స్వామి సితీ కంటానంద, గోవిందరెడ్డి

మాచర్ల: మాచర్ల శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కిడ్స్ పాఠశాలలో విద్యార్థులకు ఆధ్యాత్మిక విలువల గురించి గురువారం ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ రామకృష్ణ మిషన్ సెక్రటరీ స్వామి సితి కంటానంద పాల్గొన్నారని చెప్పారు. స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళు లర్పించారు. స్వామి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. స్వామి వివేకానంద కలలుగన్న నవభారత నిర్మాణానికి నాంది పలకాలన్నారు. సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ పాఠశాల, కళాశాలల్లో స్వామి వివేకానంద సాహిత్యంపై పరీక్షలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తున్నామని చెప్పారు. పోటీల్లో విజేతలకు స్వామి బహుమతులు అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి పవన్ కుమార్, సమితి వైస్ ప్రెసిడెంట్ గంగ్రకోట శివ సుందరప్రసాద్, హెచ్‌ఎం ముత్యాల పాపిరెడ్డి, ఉపాధ్యాయులు షేక్ చిన లాలు సాహెబ్, రామాంజి, తుమ్మకోట సమితి అధ్యక్షుడు రామయ్య పాల్గొన్నారు.

సమష్టిగా పాఠశాలల బలోపేతం



పాఠశాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ అల్లి సురేష్

మాచర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఉపాధ్యాయులందరూ సమష్టిగా పనిచేయాలని ఎంఈఓ అల్లి సురేష్ కోరారు. గురువారం మండల, పట్టణంలోని పలు పాఠశాలలను ఆయన తనిఖీ చేసి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్థితిగతులు మార్చేందుకు ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు పెడుతుందని, అలాగే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు కార్పొరేట్ స్కూళ్ల తరహాలో యూనిఫాం, టై, బెల్టు, షూ, పుస్తకాలు, అందించడమే కాకుండా ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేశారన్నారు. ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేసి విద్యాబోధనలో మెరుగుదల కనబరచి విద్యార్థుల సంఖ్య పెంచేలా పనిచేయాలని కోరారు. హెచ్‌ఎం గాదె కిరీటిరెడ్డి, ఉపాధ్యాయులు కేశవరెడ్డి, కొర్లయ్య, నిర్మల మేరి, రిహానా, ఆదిలక్ష్మి, నాగమణి తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: ప్రకృతి వ్యవసాయం సాగుకు మహిళా సభ్యులు ఆసక్తి చూపాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక ఎరువు పురుగుమందుల అవశేషాలు వినియోగించని ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేయాలన్నారు. 20 సెంట్లు భూమిలో ఆకుకూరలు, కూరగాయాలు, తదితరవన్నీ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయాలన్నారు. పచ్చిరొట్టి ఎరువుతో 30 రకాల విత్తనాలను కలిపి 365 రోజులు భూమిని కప్పి ఉంచేలాగా ఎకరానికి 25 కేజీల విత్తనాలను చల్లాలన్నారు. పొలాల్లో ఐదు రకాల అంతర పంటలకు కూరగాయలు బీరకాయ, బెండ గోరుచిక్కుడు, కంది, బంతి ఆముదం తదితర వాటిని సాగు చేయటం ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఖరీఫ్ సాగు యాక్షన్ ప్లాన్‌పై (కెఎపీ) వివరించారు. అనంతరం మండలంలోని కారుమంచి, మతుకుమల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయాలు పూలు, దుంప జాతుల, స్టాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ శిక్షణా నిపుణులు వన్నెపు తిరుపతిరావు మండల యూనిట్ ఇన్‌చార్జ్ ఓర్సు లక్ష్మీదుర్గా, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు వలేటి ప్రసాదు, మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, ఏపీయం జి.వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్య సహాయ మాత ఆలయ వార్షికోత్సవం

మాచర్ల: పట్టణంలోని రింగురోడ్డు ప్రాంతంలో ఆర్‌సీఎం నిత్యసహాయ మాత మందిర మహోత్సవాలలో భాగంగా గురువారం చర్చి పాస్టర్, విచారణ గురువులు కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఆర్ఐలు డీకన్ గ్రెగోరీ ట్రిమ్, మిస్సోరీలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలనంతరం క్రీస్తు బోధనల గురించి వివరించారు. జానపద, ముగ్గులు పోటీలు నిర్వహించి పలువురికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాలలో సంఘ పెద్దలు పాస్టర్ రఫేల్‌రెడ్డితో పాటు, పెద్దలు ఎస్ సుందరరావు, జి.కిరీటిరెడ్డి, జక్కిరెడ్డి మర్రెడ్డి, ఎస్.కస్తూరిబాయి, సంగం లూర్దు ప్రేమ్ కుమార్, గాంధీ, సిస్టర్లు తామాసమ్మ, సుజాత, ఇన్నమ్మ, ఇన్నారెడ్డి పాల్గొన్నారు.